# అమ్మ

నాకు చాలా ఆనందంగా వుంది. గబ గబా నడిచాను. రూముకు వెళ్ళాలి. రవిని కలవాలి. రవి నా స్నేహితుడు.

ఎదురుగా పున్నమి నాటి సముద్రము ఆనందంతో ఉప్పొంగి పోతోంది. నిన్నటివరకు ఎక్కడో ఒదిగి, దాగి వున్న నా కోరికల లాంటి చిన్న అలల్కు, కెరటాలుగా మారి తీరాన్ని తాకుతున్నాయి.

బీచ్‌రోడ్‌వైపు తిరుగుతూ, జేబు తడిమి చూసాను.

వుంది ! డబ్బు భద్రంగానే వుంది ! ఒకటో, రెండో కాదు రెండువేల రూపాయలు!

హాయిగా ఊపిరి పీల్చాను.

రవిని కలవాలి. రవికి యిచ్చిన మాట నిలబెట్టుకోవాలి.

ఆరునెలల క్రితం మాట అది.

నగరమంటే నియోన్‌దీపాల వెలుగులో నిగనిగలాడే విశాలమైన రోడ్ల వెనుక వీధి దీపాలకి కూడా నోచుకోని యిరుకు సందులు వుంటాయని తెలియక, నగరానికి వచ్చి కొట్టుమిట్టాడుతున్న రోజులవి.

"మా వూరు, వెళ్ళిపోవాలని అనుకుంటున్నానురా" నేను రవితో అన్నాను. బీచ్‌లోని గులకరాళ్ళు ఏరి సముద్రంలోకి విసురుతూ కూర్చున్న రవి నన్ను ప్రశ్నార్థకంగా చూసాడు.

"నాలుగు నెలలు అయిపోయాయిగా ఈ వూరు వచ్చి" నేను మళ్ళీ అన్నాను. "ఏ దారీ కనబడడం లేదు."

ఓ నక్షత్రం కూడా కనబడని నల్లని ఆకాశము నా ఎదుట విస్తరించి వుంది.

"అప్పుడే నిరుత్సాహపడితే ఎలాగరా? నేనున్నాను కదా?" రవి అన్నాడు.

నిజమే ! రవియే నాకు ఆధారము. నగరములోనే పుట్టి, పెరిగిన రవికి తలదాచుకోటానికి ఒక చిన్నగది వుంది. అందులో ఓ మూల నాకిచ్చాడు.

"నువ్వున్నావు గనుకే యిన్నాళ్ళు గడపగలిగేనురా కానీ...." నాకు మాటలు రాలేదు. ఘనీభవించిన నా వైరాశ్యములాంటి సముద్రాన్ని చూస్తూ వుండి పోయాను.

"అధైర్యపడకురా" రవి అన్నాడు. "డ్రైవింగ్ నేర్చుకుంటున్నావ్ కదా? ఏదో ఒక పని దొరుకుతుందిలే"

నడి సముద్రంలోని నావకు వూరు దగ్గర వుందని సూచించే "లైట్ హౌస్" లో నించి వచ్చిన వెలుగు నా మొహమ్మీద పడింది. ఆ వెలుతురుకు తట్టుకోలేక వెనక్కు తిరిగాను. దగ్గరలోనే నిలబడి వున్నాడు, ఒక కుర్రవాడు, మామిడికాయ ముక్కలు అమ్ముతూ అంతవరకు అదుపులో వుంచిన ఆకలి తలఎత్తింది. వాడిని రమ్మని సైగచేశాను. మామిడికాయ ముక్కలు అందుకొని డబ్బులు యిస్తుంటే అడ్డుపడ్డాడు రవి.

"నువ్వు డబ్బు లివ్వటమేమిటి నేనుండగా" అతను డబ్బులిస్తూ అన్నాడు.

"నాదగ్గర వుంది"

"లేదని నేనన్నానా?"

"బీచ్‌కి వచ్చినప్పుడల్లా ఏదో ఒకటి కొనిపెడుతున్నావ్" నేను అన్నాను "ఎప్పుడూ నాదగ్గర ఏమీ తీసుకోవు"

"తీసుకుంటానురా, కానీ యిప్పుడు కాదు. నీకు వుద్యోగం వచ్చి, జీతం అందిన రోజు మామిడికాయ ముక్కలేమి ఖర్మ ఐస్‌క్రీం, డిన్నర్ కూడా తీసుకుంటాను"

అవును రవికి డిన్నర్ యిప్పించాలి.

జేబు మరోసారి తడిమి చూసుకున్నాను. డబ్బు వుంది. ఓ రెండు వందల దాకా ఖర్చు అవుతుంది. మిగతా డబ్బు అమ్మకి పంపాలి.

అమ్మ గుర్తుకురాగానే వరదలా కొట్టుకువచ్చిన కన్నీళ్ళకు రోడ్డు కనబడలేదు.

పాపం ఎలా వుందో, ఏమో!

పారిపోయిన కొడుకు గురించి ఎన్నిరాత్రులు ఏడ్చి వుంటుందో! చల్లగాలి తగిలితే వర్షించడానికి సిద్ధముగా వుండే ఆషాఢ మేఘంలా వుంటుంది మా అమ్మ ఆవిడ నవ్వడం నేనెప్పుడూ చూడలేదు. ఆ ఇంట్లోనూ, ఈ ఇంట్లోనూ పనిచేసి సాయంతరానికి ఇల్లు

చేరుకునేది. అప్పుడప్పుడు నన్ను తన అక్కున చేర్చుకొని ఆప్యాయంగా తల నిమురుతూ ఏడ్చేది.

"ఎందుకమ్మా అలా ఏడుస్తున్నావు ఎందుకలా బాదపడుతున్నావు"

"బాధ కాదురా బెంగ. తండ్రి లేని నిన్ను పైకి తీసుకురాగలనా అనే బెంగ"

చిన్నప్పుడు అమ్మ బెంగ నా కర్థమయ్యేది కాదు. ఊరంతా మా అమ్మ గురించి గొప్పగా మాట్లాడుతూ వుంటే పొంగిపోయే వాడిని.

"నీకేమిటమ్మా నీ వెనుక అన్నపూర్ణ వుంది కదా?' ఒక ఆమె అన్నది.

"నా వెనుకేమిటి, ఎవరు ఇబ్బందుల్లో వుంటే వారి వెనుక వుంటారావిడ"

"నిజమే వదినా మొన్న మా అత్తగారు పోయినప్పుడు ఎంత చాకిరీ చేసిందని అనుకున్నావు. ఏదో యిచ్చామనుకో, కాని ఆవిడ చేసిన చాకిరీకి అదో లెక్కా?"

సంవత్సరాలు గడిచిన కొద్దీ తెలుసుకున్నాను, బ్రతుకు ఈడ్చడానికి అమ్మపడే శ్రమగురించి. ఏదో ఒక పని-చెయ్యాలని, అమ్మ శ్రమ తగ్గించాలని, నిశ్చయించుకున్నాను.

నగరంలోని నియోన్ దీపాలు నన్ను ఆకర్షించాయి. అమ్మకు ఒక్క మాట కూడా చెప్పకుండా పారిపోయి వచ్చాను. నగరం నడిరోడ్డు మీద పడ్డాను.

ఎవరో భుజం మీద చెయ్యి వేసినట్టు తోచింది. వెనక్కి తిరిగి చూసాను. ఎదురుగా ఉన్నాడు రవి.

"మా అమ్మకు ఏక్సిడెంట్ అయిందిరా" రవి అన్నాడు. "మధ్యాహ్నం ఊరినుంచి తిరిగివస్తు" నాకు మాటలు రాలేదు.

"నీ గురించే వెతుకుతున్నానురా" "ఎదురుగా వున్న ప్రభుత్వ ఆస్పత్రి వైపు నడుస్తూ అన్నాడు రవి. 'పద'.

'ఎలా వుందిరా యిప్పుడు' నేను తేరుకొని అడిగేను.

'పెద్ద ప్రమాదమేమీ కాదనుకో' వార్డులోకి అడుగుపెడుతూ రవి అన్నాడు. " ఓ చిన్న ఆపరేషన్ చెయ్యాలట"

"ఆపరేషనా..." ఎదురుగా డాక్టర్ రావటం చూసి ఆగిపోయాను.

"డబ్బు తెచ్చావా?" మా దగ్గరకు వచ్చిన డాక్టర్ అడిగేరు.

"ప్రయత్నిస్తున్నాను సార్" రవి అన్నాడు.

"బాగుంది. చాలా బాగుంది యింకా ప్రయత్నిస్తున్నావా!" డాక్టర్ హేళనగా నవ్వుతూ అన్నాడు. "ఆలస్యమైతే నువ్వుతెచ్చే డబ్బు ఆపరేషన్‌కి కాదు ఆమెను వల్లకాటికి చేర్చటానికి పనికొస్తుంది'

"ఏమిటి సార్ ఆ మాటలు?" నేను కోపంగా అడిగేను.

"లేకపోతే ఏమిటయ్యా ఆవిడ చావు బతుకుల మధ్య కొట్టుకుంటోంది. వెంటనే ఆపరేషన్ చెయ్యాలి. ఆపరేషన్ చెయ్యాలంటే డబ్బుకావాలి. అయినా నాకు తెలీక అడుగుతున్నాను, మీకు మనిషి ముఖ్యమా? డబ్బు ముఖ్యమా ?"

ఆ ప్రశ్న మేము డాక్టర్‌ని అడగవలసినదేమోనని అనిపించింది నాకు. కానీ నోరు మెదపలేదు. ఎందుకంటే అతను నాకు డాక్టర్‌లా కనపడలేదు. తన చేతికి చిక్కుకు పోయిన ఎరని చూసి మురిసిపోయే పెద్దపిల్లిలా వున్నాడు అతను.

నిమిషాలు గడిచిపోయాయి. నా ఆలోచనలు రవీ, వాళ్ళ అమ్మ చుట్టూ తిరిగాయి. ఆవిడ ఎలా వుంటారో! నేను ఆవిడని చూడలేదు గానీ అమ్మకదా, బహుశః మా అమ్మలాగే వుంటారేమోనని అనుకున్నాను.

మళ్ళీ మా అమ్మ మనస్సులో కదిలింది.

"రవీ డబ్బు తీసుకోరా" జేబులోనించి జీతం తీసి రవికి ఇస్తూ అన్నాను. 'ఈ డబ్బు ఆ డాక్టర్ కిచ్చి ఆపరేషన్ చెయ్యమను'

"ఇంత డబ్బు... నీ దగ్గర"

"ఈ రోజే జీతం అందిందిరా"

'ఒద్దురా నీ నెలరోజుల శ్రమ ఫలితం అది. ఇంకో మార్గం చూస్తాను'

"నా మాట విను, డబ్బు తీసుకో, అమ్మని బ్రతికించుకో"

'నేను తీర్చలేనేమోరా'

"ఫరవాలేదు ఈ డబ్బు నీకు కాదు అమ్మకు, అమ్మ బ్రతకాలి. మానవతకు, ఆప్యాయతకు ప్రతిరూపమైన అమ్మ బ్రతకాలి' నేను ఆవేశంతో అన్నాను. "నా శ్రమ ఫలితం మానవతని రక్షిస్తుందంటే అంతకు మించి నాకేం కావాలి"

రవికి డబ్బు యిచ్చి బయటకు నడుస్తూ వుంటే పున్నమి వెన్నల నాకు స్వాగతం పలికింది. అది వెన్నెల కాదని, మానవత్వం బ్రతికినందుకు పుడమి తల్లి పెదవిలో విరసిన చిరునవ్వేనని తోచింది నాకు.

(ఆంధ్రజ్యోతి 14-3-97)